ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

కామారెడ్డి రూరల్, మార్చి 3 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు, రైతు భరోసా, మున్సిపల్ వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల ఆక్రమణ తదితర అంశాలపై 52 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై చర్యలు చేపట్టి దరఖాస్తుదారుడికి సమాచారం అందించాలన్నారు. అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

కామారెడ్డి రూరల్, మార్చి 3 : ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని డీఈవో రాజు అన్నారు. డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత నూతన ఉపాధ్యాయులదేనని అన్నారు. నిరంతరం శిక్షణ కార్యక్రమాలు పొందుతూ కొత్త ఉత్సాహంతో పనిచేస్తు ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అకడమిక్ అధికారి వేణుగోపాల్, ఎల్లరెడ్డి మండలం విద్యాశాఖ అధికారి వెంకటేశం, రాసోర్స్ పర్సన్స్ ప్రమోద్‌రాజ్, దత్తు రాజ్, లింబాద్రి, చిన్నం నాయుడు, భవాని, జరీనా బేగం, రజిని తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

భిక్కనూరు, మార్చి 3 : మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన దండు అకుల్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. ఆదివారం కొల్లూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో (అండర్ - 12) పాల్గొని ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కోచ్ తెలిపారు. జాతీయ స్థాయికి అకుల్ ఎంపిక కావడంపై భిక్కనూరు చైతన్య పాఠశాల సిబ్బంది, అధికారులు అభినందించారు.

ఊపందుకున్న ఉపాధి హామీ పనులు

కందకాలు తవ్వుతున్న ఉపాధిహామీ కూలీలు

బాన్సువాడ రూరల్, మార్చి 3 : బాన్సువాడ మండలంలోని వివిధ గ్రామా ల్లో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధిహామీ పనులు చేసేందుకు కూలీలు తరలివస్తున్నారు. బోర్లం, హన్మాజీపేట్, ఇబ్రహీంపేట్, కోనాపూర్, తాడ్కోల్ గ్రామాల్లో సోమవారం ఉపాధి పనులకు కూలీలు తరలివచ్చారు. సీసీటీలు, ఫీల్డ్‌చానల్ పూడికతీత తదితర పనులను చేస్తున్నారు. పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించేలా గ్రామాల వారీగా కావాల్సిన పనులు గుర్తించామని ఏపీవో భిక్షపతి తెలిపారు. కూలీల డిమాండ్‌కు అనుగుణంగా పనులు గుర్తిం చి, పని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

బీబీపేట్, మార్చి 3 : బీబీపేట్ మండలంలోని కోనాపూర్ గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి భరత్ పరిశీలించి కొలతల ప్రకారం పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్‌కు సూచించారు. రోడ్లకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమం లో పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

తండాలో ఏం జరుగుతున్నది?

- గజ్యానాయక్‌తండాలో 'అధికార' వేధింపులు
- సామాన్యుడిపై ప్రతాపం చూపుతున్న వైనం
- కక్షసాధింపులకు పాల్పడుతున్న అధికార పార్టీ నేతలు

మాచారెడ్డి, మార్చి 3: దేశంలో, రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరికైనా ఒకే నిబంధనలు వర్తిస్తాయి. కానీ గజ్యానాయక్ తండాలో మాత్రం అందుకు విరుద్ధంగా నడుస్తున్నది. ఇక్కడ ఒక్కొక్కరికి ఒక్కో రూల్ వర్తింపజేస్తుండడం స్థానిక అధికారులకే చెల్లింది. శిఖం భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించారని ఒకరిద్దరికే తాఖీదులు ఇస్తున్న అధికారులు.. మిగతా వారి వైపు కన్నెత్తి చూడకపోవడం అనేక విమర్శలకు తావిస్తున్నది. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీ నేతలు ఉన్నారని, కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఇలా ఉసిగొల్పుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కబ్జాకు పాల్పడ్డారని భావిస్తే అక్రమ కట్టడాలన్నీ తొలగించాలని, కానీ ఒక్కరిని టార్గెట్‌గా చేసి వేధించడం సరికాదని మండిపడుతున్నారు.

గజ్యానాయక్ తండాలోని వీక్లీ మార్కెట్ రోడ్‌లో కొన్ని నిర్మాణాలు ఉన్నాయి. ఇందులో ఏఎంసీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నేత అజీజ్ సోదరుడు అజీమ్‌కు మూడు షట్టర్లు ఉన్నాయి. అయితే, వీక్లీ మార్కెట్ చెరువు శిఖం భూమిలో ఉన్నదని, షట్టర్ల ముందర వేసిన రేకుల షెడ్డును వెంటనే తొలగించాలని జీపీ కార్యదర్శి రిజ్వానా నోటీసులు జారీ చేశారు. శిఖం భూమిలో అనేక కబ్జాలు ఉన్నా వారెవరికీ నోటీసులు ఇవ్వకుండా కేవలం అజీమ్‌కు ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, శిఖం అని చెబుతున్న భూమిలో ఉన్న నిర్మాణాలన్నింటినీ తొలగిస్తే తన షెడ్లు కూడా తొలగిస్తానని బాధితుడు చెబుతున్నాడు. అలా కాకుండా తన నిర్మాణాలే కూల్చేయాలనడం ఏమిటని ప్రశ్నిస్తున్నాడు. నోటీసులు ఇస్తే అందరికీ ఇవ్వాల్సి ఉండగా, ఒక్కరికే ఎలా ఇస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. శిఖం భూమి కబ్జాకు గురవుతున్నదని కార్యదర్శికి, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

శిఖం భూమిలో అక్రమంగా ప్రహరీలు నిర్మించారని చూపుతున్న బాధితుడు అజీజ్

ఇదేం కక్షసాధింపు..

వీక్లీ మార్కెట్ రోడ్‌లోని శిఖం భూమిని చాలా మంది కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఏఎంసీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నేత అజీజ్ తెలిపారు. పైగా ఇంటి నంబర్లు కేటాయిస్తూ ఇతరులకు అమ్ముతున్నారన్నారు. రాజకీయ నేతల కక్షసాధింపులో అధికారులు భాగం కాకుండా పూర్తి స్థాయి విచారణ జరిపి, చర్యలు చేపట్టాలన్నారు. శిఖం భూమిలో నిర్మించిన అన్ని షెడ్లు తొలగిస్తే తన కుటుంబ సభ్యుల షెడ్లను తానే తొలగిస్తానని తెలిపారు. అధికారులు అందరినీ ఒకే దృష్టితో చూడాలని, ఎవరో చెప్పినట్లు చేయడం సరికాదన్నారు.

'ఎల్ఆర్ఎస్'లో 25 శాతం రాయితీ

కామారెడ్డి రూరల్, మార్చి 3: ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లో ప్రభుత్వం ప్రకటించిన 25శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి మున్సిపల్ అధికారులు సూచించారు. పట్టణంలో అనధికార లే అవుట్, ప్లాట్ యజమానులు 2020లో ఎల్ఆర్ఎస్ కోసం రూ. పదివేలు, వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 31లోపు 25 శాతం తగ్గింపు రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ప్లాట్లను మున్సిపల్ సిబ్బందితో సర్వే చేయించి లే-అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

వాట్సాప్ లింక్ ద్వారా అకౌంట్ ఖాళీ

మాచారెడ్డి, మార్చి 3 : మండలంలోని సర్దాపూర్‌తండాకు చెందిన నునావత్ దేవేందర్ తన ఫోన్‌లో తెలిసిన ఫ్రెండ్ ద్వారా వాట్సాప్‌లో వచ్చిన లింకుపై క్లిక్ చేయడంతో అకౌంట్ లో రూ.1,23,910 ఖాళీ అయ్యాయి. ఆ లింక్‌ను క్లిక్ చేసి డబ్బులు ఎక్కువగా వస్తాయని సైబర్ నేరాగాళ్లు ఆశచూపారని, విడుతల వారీగా డబ్బులు అకౌంట్ నుంచి ఖాళీ అయ్యాయన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ వివరించారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

బాన్సువాడ, మార్చి 3 : బాన్సువాడ మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 19 వార్డుల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడూ మురుగుకాలువలను శుభ్రం చేయించడంపై అధికారులు దృష్టి సారించారు. మురుగు కాలువలను శుభ్రం చేయ డంతోపాటు తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ శ్రీహరి బాబు వివరించారు.

మార్కెట్ కమిటీలో సమీక్షా సమావేశం

నస్రుల్లాబాద్, మార్చి 3 : బీర్కూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నస్రుల్లాబాద్ మం డలం మైలారంలో ఏఎంసీ సబ్‌యార్డు చుట్టు ప్రహరీ నిర్మాణం, గుట్ట చదును, బీర్కూర్ వ్యవసాయ మర్కెట్ కమిటీ వద్ద స్వాగత తోరణ నిర్మాణానికి తీర్మానం చేసినట్లు చైర్‌పర్సన్ శ్యామల తెలిపారు.

మొబైల్ ఫోన్ అందజేత

మాచారెడ్డి, మార్చి 3 : పాల్వంచ మండలంలోని మంథ నిదేవునిపల్లి గ్రామానికి చెందిన కామాటి భిక్షపతి ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి సోమవారం పోలీస్ స్టేషన్ లో అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్(దోమకొండ), మార్చి 3 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై స్రవంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిందన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సైబర్ నేరాల బారినపడకుండా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

భిక్కనూరు, మార్చి 3 : మండల కేంద్రంలోని జెండా గల్లీలో నీటి సమస్య పరిష్కరించాలని ఆర్టీఐ జిల్లా ప్రతినిధి గంగల రవీందర్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొంత కాలం నుంచి జెండాగల్లీలో నీటి సమస్య ఉన్నదని, కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పరిష్కరించాలని కోరారు.

నేటి నుంచి ఎమ్మార్పీఎస్ ప్రదర్శనలు

మాచారెడ్డి, మార్చి 3 : మండల కేంద్రాలతోపాటు జిల్లా కేంద్రంలో నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఎమ్మార్పీఎస్ ప్రదర్శనలు నిర్వహించనున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యెల్ అన్నారు. మండలంలోని అక్కాపూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌లో అన్ని కులాలకు న్యాయం జరిగేలా ఏ, బీ, సీ, డీ గ్రూప్‌లుగా విభజించాలన్నారు. జస్టిస్ షమీమ్ అక్తార్ నివేదికలో ఉన్న లోపాలను సరిచేసి ఎస్సీలోని అన్ని కులాలకు ఎస్సీ ఫలాలు అందేలా వర్గీకరణ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బట్ట రమేశ్, లక్ష్మి, లావణ్య, శైలేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మాచారెడ్డి, మార్చి 3 : మండలంలోని లచ్చాపేట జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సొసైటీ ప్రతినిధులు అనిల్‌రెడ్డి, కృష్ణాకర్, కృష్ణారావు, రజనీకాంత్, నవీన్, శ్రీకాంత్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి రూరల్/బాన్సువాడ రూరల్/ నస్రుల్లాబాద్, మార్చి 3 : బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్, డైరీని ప్రభుత్వ మాజీ విప్ గంపగోవర్ధన్ ఆయన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ లు అమలుచేసే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రతి హామీని అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు బలవంతరావు, బాలచంద్రం, బాలమణి, మధుసూదన్ రావు, పార్టీ అధికారం ప్రతినిధులు బల్వంత్‌రావు, శ్రీనివాస్, భాను, శంకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బాన్సువాడ మండలం హన్మాజీపేట్‌లో

బాన్సువాడ రూరల్, మార్చి 3 : బాన్సువాడ మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆ పార్టీ డైరీ, క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. క్యాలెండర్లు, డైరీలను నాయకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, శివరాజులు, సాయిలు, శివ, కాశీరాం, గణేశ్, రత్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లోని బస్తాండు ఆవరణలో బీఆర్ఎస్ నాయకులు క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహులుగౌడ్, అఫ్రోజ్, సాయిలు, శంకర్, వెంకట్, రమేశ్, గంగారాం, అంజయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

మూడు ఆటో ట్రాలీల పట్టివేత

నస్రుల్లాబాద్, మార్చి 3 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామ శివారులో సోమవారం ఎలాంటి పత్రాలు లేని మూడు ట్రాలీ ఆటోలను పట్టుకున్నట్లు మద్నూర్ ఎంవీఐ జ్యోతి తెలిపారు. మెదక్ జిల్లాకు చెందిన ట్రాలీ ఆటోలు నిజామాబాద్ జిల్లా పొతంగల్ గ్రామంలోని మార్కెట్ నుంచి మేకలను తీసుకెళ్తుండగా భైరాపూర్ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకుని బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు.

గౌరారం పాఠశాలలో ప్రపంచ వినికిడి దినోత్సవం

గాంధారి, మార్చి 3: మండలంలోని గౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్ఎం రాములు మాట్లాడుతూ ప్రతి ఏడాది మార్చి 3వ తేదీన ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని జరుపుకొంటామని తెలిపారు. జ్ఞానేంద్రియాల్లో చెవి ముఖ్యమైనదని, ప్రతి ఒక్కరూ అధిక శబ్దాలకు దూరంగా ఉండాలన్నారు. భారీ శబ్దాలు విన్నప పుడు చెవిలోని పొరలు దెబ్బతిని, వినికిడి లోపం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు పెంటయ్య, తాడ్వాయి శ్రీనివాస్, ఉపాధ్యాయులు బాపూరావు, నిరోష, సరిత తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సస్యరక్షణ కిట్లు పంపిణీ

రామారెడ్డి, మార్చి 3 : సదాశివనగర్ మండలం ధర్మరావుపేట్ గ్రామంలో సోమవారం కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా రైతులకు సమగ్ర సస్య రక్షణ కిట్లు అందించారు. ప్లాంట్ ప్రొటక్షన్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి రైతులు పురుగు మందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బానోత్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి ప్రజాప్రతి, రైతులు పాల్గొన్నారు.

కుమ్మరి శాలివాహన కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, మార్చి 3: లింగంపేట గ్రామ కుమ్మరి శాలివాహన యువజన సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా నరేశ్, ప్రధాన కార్యదర్శిగా వేణు, కోశాధికారిగా రవీందర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు సన్మానించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

లింగంపేట(తాడ్వాయి), మార్చి 3: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. తాడ్వాయి గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, చెడు వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, యువతులు, మహిళలు అత్యవసర సమయాల్లో 1930, 100, 108, 181టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మవాగు వంతెన పనులు త్వరగా చేపట్టాలి

వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామారెడ్డి, మార్చి 3 : మండల కేంద్రంలో ఏడాదిన్నరక్రితం ప్రారంభమైన గంగమ్మవాగు బ్రిడ్జి పనులు వంతెన పూర్తి కాకుండానే గుత్తేదారు తట్టాబుట్ట సర్దుకొని పోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తాత్కాలికంగా నిర్మించిన మట్టిరోడ్డు రోజు రోజుకూ కుంగిపోతున్నది. వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సోమవారం ఉమ్మడి సదాశివనగర్ మండల మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్, కొంత మంది బీఆర్ఎస్ నాయకులు కలిసి ఆర్ అండ్‌బీ ఈఈ కార్యాలయానికి తరలివెళ్లారు. ఈఈ రవిశంకర్ లీవ్‌లో ఉండడంతో ఫోన్‌లో ఆయనకు సమస్యను వివరించి కార్యాలయంలో ఉన్న డీఏవో సంతోషికి వినతిపత్రం అందజేశారు. ఆయనవెంట కాలభైరవస్వామి ఆలయ చైర్మన్ గంజి సతీశ్‌గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు జంగం లింగం, రాజు తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యపు నీడలో 'ప్రజావాణి'

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 3: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ''ప్రజావాణి'' అధికారుల నిర్లక్ష్యం కారణంగా తూతూ మంత్రంగా కొనసాగుతున్నది. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి సమస్యలకు సంబంధించి దరఖాస్తులు తీసుకొని పరిష్కరించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు హాజరుకాక, కార్యాలయాలు మూసి ఉండడంతో దరఖాస్తులను ఎవరికివ్వాలో తెలియని ప్రజలు ఏం చేయాలో దిక్కుతోచక తిరిగి వెళ్లిపోతున్నారు. మండల పరిషత్, రెవెన్యూ, వెటర్నరీ, వైద్యారోగ్య, మున్సిపల్, నీటిపారుదల, రోడ్లు భవనాలు, ఐకేపీ, విద్యాశాఖ, అగ్రికల్చర్, వసతిగృహాలు, అటవీశాఖ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, విద్యుత్ తదితర శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా ప్రజావాణి ప్రారంభమైన గంట వరకూ ఒక్క మున్సిపల్‌శాఖ అధికారులు మాత్రమే హాజరు కావడం ఆశ్చర్యపరిచింది. తహసీల్ కార్యాలయంలోనే కొనసాగుతున్న ప్రజావాణికి రెవెన్యూ కార్యాలయ అధికారులు హాజరుకాకపోవడం, విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో సమయం అవుతున్నా తాళాలు తీయకపోవడం కొసమెరుపు. నామ్ కే వాస్తేగా నిర్వహిస్తున్న ప్రజావాణికి అధికారులు ఇష్టం వచ్చిన సమయంలో వచ్చి హాజరువేసుకొని వెళ్లిపోతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రజావాణి సమయంలో మూసిఉన్న ఎల్లారెడ్డి విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం

ప్రజావాణికి అధికారుల డుమ్మా...

పెద్ద కొడప్‌గల్, మార్చి 3 : తహసీల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు డుమ్మాకొడుతున్నారు. ప్రజల సమస్యల కోసం ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోకపోవడంతో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజావాణికి అధికారులు డుమ్మా కొట్టడం వల్ల దరఖాస్తులు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు రాకపోవడంతో ఆర్జీదారులు జిల్లాకేంద్రంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వెళ్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ప్రజావాణికి మండల పరిషత్, ఆరోగ్యశాఖ అధికారులు తప్ప మిగతా శాఖల అధికారులు హాజరు కాలేదు. డుమ్మా కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోకపోవడం వల్లే వారు ప్రజావాణిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గాంధారిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులు

లింగంపేట(తాడ్వాయి), మార్చి 3: రేపటి నుంచి ఆరంభమయ్యే ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాటు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సురేఖ సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలకు చెందిన 161 మంది , గురుకుల పాఠశాలకు చెందిన 136 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులు సమయపాలన పాటించాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ దుర్గయ్య తెలిపారు. లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మైనార్టీ గురుకుల, జ్యోతిబాపూలే గురుకుల, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల,ప్రభుత్వ జూనియర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 321 మంది, ద్వితీయ సంవత్సరంలో 228 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు..

గాంధారి, మార్చి 3 : ఈ నెల 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, ఎస్సై ఆంజనేయులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలోని గదులతో పాటు పరిసరాలను పరిశీలించారు. పరీక్షలు రాయడానికి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇంటర్ పరీక్షా కేంద్ర పరిసరాల్లో 163 బీఎన్ఎస్ఎస్(144) సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

లింగంపేట, మార్చి 3: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. అనంతరం కామారెడ్డి-ఎల్లారెడ్డి రహదారిపై ఆయన మాట్లాడారు. ఆర్ఎఎఫ్ డిప్యూటీ కమాం డర్ డీపీ భగేల్, ఎస్సై వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

కబ్జాకు గురైన భూమి ఇప్పించాలని

తహసీల్దార్‌కు వినతి